www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025

కోడి మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు మండలంలోని వేల్పూరులో ఉన్న కృష్ణానందం పౌల్ట్రీ ఫారంలో బర్డ్‌ఫ్లూ కేసు నమోదైనట్లు తహశీల్దార్ డివివిఎస్.అశోక్‌వర్మ తెలిపారు. మంగళవారం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ తణుకు మండలంలోని కొమరవరం, ఎర్రాయిచెరువు, వేల్పూరు, మండపాక, తేతలి, తణుకు పట్టణ పరిధిలో కోడిమాంసం, గుడ్ల విక్రయాలు నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు మీరి విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పౌల్ట్రీపై పిడుగు..!

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో లక్షల సంఖ్యలో కోళ్లు మృతి

వేల్పూరు కృష్ణానంద పౌల్ట్రీలో కోళ్లకు ఎవిఎన్ ఇన్‌ఫ్లూ ఎంజా పాజిటివ్‌గా నిర్ధారణ

'పశ్చిమ'లో 17 గ్రామాలు సర్వేలైన్ జోన్‌లోకి

ఏలూరులో 365, పశ్చిమలో 126 పౌల్ట్రీ ఫామ్‌లు

జనాల్లో తీవ్ర ఆందోళన.. పౌల్ట్రీ రైతులకు కోలుకోలేని దెబ్బ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పౌల్ట్రీ రంగానికి ఎదురు దెబ్బ తగిలింది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటి వరకూ అందిన లెక్కల ప్రకారం పశ్చిమలో 2.50 లక్షల కోళ్లపైన, ఏలూరు జిల్లా బాదంపూడి ప్రాంతంలో లక్షా 50 వేలు కోళ్ల వరకూ చనిపోయినట్లు తెలుస్తోంది. దీంతో కోళ్లఫారాలు నడుపుతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 365 పౌల్ట్రీ ఫామ్స్ ఉండగా కోటీ 30 లక్షల కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రతిరోజూ 90 లక్షల నుంచి కోటి వరకూ గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 126 పౌల్ట్రీఫామ్స్ ఉండగా 26 లక్షల వరకూ కోళ్ల పెంపకం సాగుతోంది. 23 లక్షల వరకూ గుడ్లు ఉత్పత్తి సాగుతోంది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ అనుమానంతో 83 వరకూ శాంపిల్స్ సేకరించి ఈ నెల ఆరో తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని నేషనల్ హైసెక్యూర్టీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబోరేటరీకి పంపించినట్లు తెలిసింది. పశ్చిమగోదావరి జిల్లా వేలూర్పులోని కృష్ణానంద పౌల్ట్రీఫామ్‌లో కోళ్లకు ఎవిఎన్ ఇన్‌ఫ్లూ ఎంజా (బర్డ్‌ఫ్లూ వైరస్) ఉన్నట్లు నిర్ధారణయ్యింది. ఇది అంటువ్యాధి. అత్యధికంగా వ్యాప్తి చెందే స్వభావం దీనికి ఉంటుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లలో ఉండే హెచ్5ఎన్1 జాతి వైరస్ ప్రాణాంతకమైంది. ఇది రోజుల వ్యవధిలోనే పెంపుడు పక్షులు, కోళ్లకు సోకుతుంది. పక్షుల రెట్టలు, లాలాజలం, కలుషితమైన ఆహారం, నీటిద్వారా ఇది వ్యాపిస్తుంది. కోళ్లలో బర్డ్‌ఫ్లూ వైరస్ నిర్ధారణ కావడంతో పశ్చిమ కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టారు.

కృష్ణానందం పౌల్ట్రీ నుంచి పది కిలోమీటర్ల వరకూ అల్లర్ జోన్..

పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని వేల్పూరులో కృష్ణానందం పౌల్ట్రీ నుంచి కిలోమీటర్ వరకూ ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తించడంతోపాటు పది కిలోమీటర్ల వరకూ సర్వేలైన్స్ జోన్ (అలర్ట్‌జోన్)గా ప్రకటించారు. కృష్ణానందం పౌల్ట్రీ నుంచి కిలోమీటర్ పరిధిలో దాదాపు ఐదు వరకూ కోళ్లఫారాలు ఉండగా వీటిలో ఉన్న కోళ్లన్నింటినీ ఆరడుగుల లోతున గోతులు తీసి పాతిపెట్టే ప్రక్రియ సాగుతోంది. మూడు నెలల వరకూ ఈ పరిధిలోని పౌల్ట్రీలు తెరవకూడదు. పది కిలోమీటర్ల మేర అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్ పరిధిలో కోళ్లు, గుడ్ల రవాణా పూర్తిగా నిషేధించారు. కోడిమాంసం అమ్మకాలు సైతం జరగకుండా ఆదేశాలు జారీఅయ్యాయి. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

ఆందోళనలో ప్రజలు..

బర్డ్‌ఫ్లూ వైరస్ కలకలంతో రెండు జిల్లాల ప్రజానీకంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కోడిగుడ్లు, కోడిమాంసం తినడంపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్న ప్రకారం ఉడికించిన గుడ్లు, వండుకున్న చికెన్ తినడం వల్ల ఇబ్బందులు ఉండవు. రెడ్‌జోన్ పరిధిలో ఉన్నవారు మాత్రం తినకూడదు. వంటకంలో వంద డిగ్రీల వేడి వరకూ ఉంటుంది. 70 డిగ్రీల వేడి తగిలితే వైరస్ చనిపోతుంది. పచ్చిగుడ్లు, మాంసం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు. 21 రోజుల వరకూ కోడిమాంసం, గుడ్లు తినకుండా ఉండటం మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తీవ్ర నష్టాల్లో పౌల్ట్రీ రైతులు..

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోళ్లు చనిపోవడం, అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోవడంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు కోటీ 50 లక్షల కోళ్ల పెంపకం జరుగుతోంది. వీటిపై పెట్టిన ఖర్చంతా రైతులు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి పౌల్ట్రీ రైతు రూ.కోట్లలో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోకపోతే పౌల్ట్రీ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది.

బర్డ్‌ఫ్లూకు అడ్డుకట్ట ఎలా..?

బర్డ్‌ఫ్లూ వైరస్‌ను అరికట్టేందుకు పౌల్ట్రీ రైతులు తీసుకోవాల్సిన చర్యలపై రెండు జిల్లాల పశుసంవర్ధక శాఖాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. కోళ్లు చనిపోతూ ఉంటే వెంటనే దగ్గరలోని పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఫామ్స్‌లోకి కొత్త వాళ్లను రానీయకూడదు. వైరస్ సోకిన జిల్లాల నుంచి కోళ్ల దాణా తెచ్చుకోకూడదు. ఫామ్స్ వద్ద పరిశుభ్రత పాటించాలి. అలర్డ్‌జోన్ పరిధిలోని ప్రజలు కనీసం 21 రోజుల వరకూ గుడ్లు, మాంసం వంటివి తినకపోవడం మంచిదని చెబుతున్నారు. పచ్చిమాంసం, గుడ్లు తినకూడదు.

వేల్పూరులో బర్డ్ ఫ్లూ

ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణ

కృష్ణానందం పౌల్ట్రీ ఫామ్ నుండి కిలోమీటర్ పరిధి ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తింపు

కోళ్ల ఫారాలు మూడు నెలలపాటు మూసివేయాలని ఆదేశాలు

వ్యాధి సోకిన, హెచ్చరిక జోన్ పది కిలోమీటర్ల లోపల, వెలుపల కోళ్లు, గుడ్ల రవాణా నిషేధం, చెక్‌పోస్టుల ఏర్పాటు

చనిపోయిన కోళ్ల తొలగింపునకు 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసు వెలుగుచూసింది. వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీ నమూనాలను పరీక్షించగా ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణయ్యిందని, దీన్ని అరికట్టేందుకు అన్ని రకాల అత్యవసర చర్యలను చేపట్టామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

మంగళవారం పెదఅమిరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కృష్ణానందం పౌల్ట్రీలో సోకిన ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజాపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ నాగరాణి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కృష్ణానందం పౌల్ట్రీలో నమూనాలను పరీక్షించగా ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణైందని, కృష్ణానందం పౌల్ట్రీ ఫామ్ నుండి కిలోమీటర్ ప్రాంతాన్ని ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తించామని, జోన్‌లో మృతి చెందిన కోళ్లు, పక్షులను తొలగించి పాతి పెట్టడానికి ఆదేశించామని తెలిపారు. ఇన్ఫెక్షన్ జోన్‌లోని కోళ్ల ఫారాలను మూడు నెలలపాటు మూసివేస్తారన్నారు. ఇన్ఫెక్షన్ జోన్ నుండి పది కిలోమీటర్ల ప్రాంతాన్ని సర్వేలెన్స్ జోన్‌గా (అలెర్ట్ జోన్) గుర్తించామన్నారు. 17 గ్రామాలు సర్వేలెన్స్ జోన్‌లో ఉన్నాయని, అవి కొమరవరం, అత్తిలి, కావలిపురం, ఎర్రాయిచెరువు, గోటేరు, మండపాక, ఇరగవరం, తేతలి, రేలంగి, గుమ్మంపాడు, పాలి, వరిగేడు, బల్లిపాడు, తణుకు, మల్లిపూడి, అర్జునుడిపాలెం గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ పరిధిలోని అన్ని చికెన్, గుడ్ల దుకాణాలు మూసివేయడానికి ఆదేశించినట్లు తెలిపారు. వ్యాధి సోకిన, హెచ్చరిక జోన్ 10 కిలోమీటర్ల లోపల, వెలుపల కోళ్లు, గుడ్ల రవాణా పూర్తిగా నిషేధించామన్నారు. నిఘా ప్రాంతంలోని అన్ని పొలాలు మూడు వారాలపాటు పరిశీలనలో ఉంటాయని తెలిపారు. వేల్పూరు బైపాస్, వేల్పూరు రైల్వే గేటు, అత్తిలి, వీరభద్రపురం, మల్లిపూడి, కొత్తపాడు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వెటర్నరీ డాక్టర్, ఇతర సిబ్బందితో కలిపి 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, వారి పరివేక్షణలో కోళ్ల తొలగింపు, పూడ్చి పెట్టే పనులు సాగుతాయని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్యం, పారవేయడం విధానాలను కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. రెడ్‌జోన్ పరిధిలో జెసిబిలు, లైమ్, బ్లీచింగ్ పౌడర్‌లను సమకూర్చాలని, పోలీసు శాఖ శాంతిభద్రతలను, కోళ్లు, పౌల్ట్రీ ఉత్పత్తుల కదలికపై కఠినమైన నిఘా ఉంచాలన్నారు. అడవి, వలస పక్షుల మరణాలు ఆ ప్రాంతంలో ఏమైనా జరిగితే పరిశీలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిపిఒ అరుణశ్రీ, డిఎఫ్ఒ ఆశాకిరణ్, డిఎస్ఒ బి.సరోజ, డిఎంహెచ్ఒ భాను నాయక్, రవాణా శాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో అధికారులు, అభ్యర్థులు

11 నామినేషన్లు తిరస్కరణ

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానానికి 43 మంది నామినేషన్లు ఓకే

ఉపసంహరణకు 13వ తేదీ వరకూ గడువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. మరో 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలనను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పాల్గొన్నారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో ఇండిపెండెంట్లు రాయుడు శ్రీనివాసు, శెట్టిబత్తుల రాజాబాబు, భావన ధాన్యలక్ష్మి, కొండపల్లి శ్రీనివాసు, మహ్మద్ ఆలీ జామ్ షీద్, డికెవి ప్రకాష్, కొరుసు రాజకీర్తి, మెర్ల శ్రీవాణి, జీవదేవ దయాకర్ ఖండవల్లి, నేషనల్ నవక్రాంతి పార్టీకి చెందిన పాదముత్యం ప్రతాప్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా భీమ్‌రావ్ అంబేద్కర్ పార్టీకి చెందిన నీతిపూడి రామకృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పదో తేదీన నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 54 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో 11 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో 43 మంది మిగిలారు. ఈ నెల 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సాగనుంది. అదేరోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు.

ఉసురు తీసిన ఆర్థిక ఇబ్బందులు

రైలు కింద పడి వృద్ధ దంపతుల ఆత్మహత్య - శోకసంద్రంలో తాళ్లముదునూరుపాడు

ప్రజాశక్తి - ఉంగుటూరు, తాడేపల్లిగూడెం

మృతులు వెంకట రమణారెడ్డి, విమలాదేవి (ఫైల్‌ఫోటోలు)

వ్యాపారాల్లో వరుస నష్టాలు వారిని చుట్టుముట్టాయి. చిన్న కుమార్తె కొంత ఆర్థికంగా సాయం చేసినా వ్యాపారాల్లో వరుస నష్టాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఓపక్క అప్పులు.. మరోపక్క సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆ వృద్ధ దంపతులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో మృత్యుబాట పట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ శివార్లలో 18వ వార్డు తాళ్లముదునూరుపాడుకు చెందిన తాడి వెంకట రమణారెడ్డి (62), ఆయన భార్య తాడి విమలాదేవి (52) సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై ఏలూరు జిల్లా ఉంగుటూరు చేరుకున్నారు. అక్కడ జాతీయ రహదారి పక్కనే మోటారు సైకిల్ నిలిపారు. అనంతరం వారు రైలుపట్టాల పైకి చేరుకున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వారి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. మంగళవారం ఉదయం ట్రాక్‌మ్యాన్ ఇచ్చిన సమాచారంతో సిఐ సోమరాజు, ఎస్ఐ అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోనులో నెంబర్లు ఆధారంగా ఫోన్ చేయగా మృతుల వివరాలు వెల్లడయ్యాయి. మృతుడు వెంకట రమణారెడ్డి గతంలో కలప వ్యాపారం చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చిన్నకుమార్తె కొంత ఆర్థిక సాయం అందించింది. హోటల్ నడపగా నష్టాల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పుల పాలవ్వడం, మరోపక్క సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇరువురికి వివాహాలయ్యాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

భూసంబంధిత కోర్టు కేసులు, తగదాలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని డిఆర్ఒ, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లతో భూసంబంధిత కోర్టు కేసులు, తగదాల పరిష్కారంపై ఆయన గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కోర్టు కేసులు, భూసంబంధిత తగాదాలు, కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని పెండింగు కేసులపై కౌంటర్లను ఎప్పటికప్పుడు దాఖలు చేసి, కేసుల పరిష్కారానికి సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను, భూములను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో పాల్గొన్నారు.

గ్యాస్ వెలికితీసేటప్పుడు ప్రజలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

దేశాభివృద్ధికి చమురు, గ్యాస్ ఉత్పత్తులను వెలికి తీయడం ఎంత ముఖ్యమో, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవడం అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒఎన్‌జిసి ప్రతినిధులకు సూచించారు. ఒఎన్‌జిసి 20 బావుల తవ్వకాల ద్వారా చమురు, గ్యాస్ ఉత్పత్తి చేసేందుకు ప్రతిపాదించిన భీమవరం మండలం నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం గ్రామాల ప్రజలతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ సందర్భంగా మంగళవారం నాగిడిపాలెం తుపాను పునరావాస కేంద్రం ఖాళీ ప్రదేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నాగిడిపాలెం, దెయ్యాల తిప్ప, నాగేంద్రపురం ప్రాంతాల అభివృద్ధికి ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారి సంక్షేమాన్ని చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బోర్ వెల్స్ డ్రిల్లింగ్ చేసేటప్పుడు స్థానిక నివాసితులకు ముందస్తు సమాచారం అందజేయాలన్నారు. గ్యాస్ లీకేజీల సమాచారం అందరూ తెలుసుకునేందుకు సెన్సార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా చదువుకున్న యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించి, ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. తాగునీటి వనరులను తరచూ పరిశీలించి, శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాలుష్య మండలి చీఫ్ ఇంజినీర్ పి.ప్రసాదరావు, పిసిబి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్‌రావు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో మంత్రులతో ఆక్వా రైతుల భేటీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమకు సంబంధించి సమస్యలు పేరుకుపోతున్నాయని, వాటి పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13, 14 తేదీల్లో జై భారత్ ఆక్వా రైతు సంఘం తరఫున అమరావతిలో మంత్రులను కలవనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్‌రాజు చెప్పారు. స్థానిక ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో సంఘ రాష్ట్ర ముఖ్య నేతల సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆక్వా ఫీడ్ రేటు తగ్గినా తగ్గించడం లేదని, నాణ్యమైన సీడ్ దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గతంలో ప్రాసెసింగ్ యార్డ్ యాజమాన్యం ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని చెప్పారు. మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా మంత్రులను కలుస్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అన్ని రైతుసంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ప్రభుత్వంతో పోరాడతామన్నారు. ఉపాధ్యక్షులు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు, టియువిఆర్.సుధీర్‌రెడ్డి, కోడి విజయ్‌భాస్కర్, కార్యదర్శి బోనం చినబాబు, గుంటూరి చంటిరాజు, మేడిది జాన్‌రాజు, మేకా ఫణీంద్ర ప్రసాద్, బోవం రంగయ్య నాయుడు, దాట్ల సోమేశ్వరరాజు (సోంబాబు), అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ఎంయు ఆధ్వర్యాన ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

డిపోలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భీమవరం డిపోకు చెందిన మెకానిక్ యువి.రావుపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయు ఆధ్వర్యంలో భీమవరం ఆర్‌టిసి డిపో వద్ద ఆరు రోజులుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా మంగళవారం స్థానిక డిపోలోని ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎంఎస్.బాబు, ఎ.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రవిశంకర్, ట్రెజరర్ జి.మస్తానయ్య, పబ్లిసిటీ సెక్రటరీలు షేక్ మొహిద్దీన్, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ చైర్మన్ సూర్యనారాయణ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక యూత్ హాస్టల్స్ పట్టణ శాఖ ఛైర్మన్, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కారుమూరి సూర్యనారాయణ (72) గుండెపోటుతో మంగళవారం మధ్యాహ్నం అంతర్వేదిలో మృతి చెందారు. సూర్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 45 రోజుల క్రితం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ వేడుకల్లో వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో సేవలు అందించేందుకు అంతర్వేదికి వెళ్లారు. సూర్యనారాయణ వైశ్యా బ్యాంక్ ఉద్యోగిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. స్టాంపులు, నాణాముల సేకరణ, ప్రదర్శన సూర్యనారాయణకు హాబీ. పలు రాష్ట్రాల్లో స్టాంపులు, నాణెముల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆయన మృతి పట్ల యూత్ హాస్టల్స్ అధ్యక్షుడు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, భూపతి రాజు అత్యుత రామరాజు, నూలి భాస్కర్ తదితరులు సంతాపం తెలిపారు.



వీరరాఘవులును గెలించాలని ప్రచారం చేస్తున్న ఐలు న్యాయవాదులు

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - తణుకు

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులును గెలిపించాలని ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ 35 సంవత్సరాలు ఉపాధ్యాయ సంఘాలతో పనిచేసి అనేక సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తిని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పనిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని, పదవుల కోసం పోటీ చేసే వ్యక్తుల కన్నా కష్టపడి పనిచేసే వ్యక్తి రాఘవులు అని ఆయనను గెలిపించాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో బి.విక్టర్‌బాబు, ధనాల అప్పారావు, చింతపల్లి నాగేశ్వరరావు, ఎన్.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

చెత్త సేకరణపై అవగాహన

నరసాపురం:తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్లో మంగళవారం చెత్త సేకరణపై శానిటేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నరసాపురాన్ని క్లీన్ పట్టణంగా రూపొందించే విధంగా ప్రతి పౌరుడూ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. రోడ్డుపైనా, డ్రెయిన్లలో చెత్త వేయకుండా డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్త వేరువేరుగా వేసి ఇవ్వాలన్నారు. శానిటేషన్ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. ప్రజలందరికీ 3 డస్ట్ బిన్లపై అవగాహన కల్పించాలని, మెప్మా, శానిటరీ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, మెప్మా ప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 15 గ్రాముల బంగారం విరాళం

భీమవరం టౌన్:మావుళ్లమ్మ అమ్మవారికి సూళ్లూరుపేటకు చెందిన ఐ.చంద్రశేఖర్‌రావు చంద్రమతి దంపతులు 15 గ్రాముల బంగారం విరాళంగా మంగళవారం ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధానార్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు.

ఢిల్లీ తరలిన ఎల్ఐసి ఏజెంట్లు

పాలకొల్లు రూరల్:న్యూఢిల్లీలో ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్ల ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకొల్లు నుంచి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) సభ్యులు తరలివెళ్లారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన జాతీయ నాయకులతో పాటు జోనల్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్, జోనల్ సెక్రటరీ పిఎల్ నరసింహారావు, స్టేట్ సెక్రటరీ జి.రవికిషోర్ పాల్గొన్నారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రలేచి ఎల్ఐసిని ప్రయివేటుపరం చేసే ఆలోచనను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు బ్రాంచి నుంచి నాయకులు ఐఎస్ఎన్ రాజు, ఉద్దగిరి భాస్కరరావు, కస్తూరి శ్రీనివాస్, గుడాల బాలాజీ, జక్కంశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టకు ఏర్పాట్లు

కాళ్ల:కలవపూడిలో ఉమా భీమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కలవపూడిలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 1967లో నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరిందని, ఆలయ పునర్నిర్మాణ పనులు చేసేందుకు గ్రామస్తులు, దాతలు ముందుకు రావడంతో ఏడాదిలో నిర్మాణం చేపట్టామన్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. 21న ఆలయ ప్రతిష్ట ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అఖండ అన్నసమారాధన ను నిర్వహిస్తున్నామన్నారు.

నాన్ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి - పాలకోడేరు

బోర్డులు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి గోపీ

పాలకోడేరు పంచాయతీ పరిధిలోని అక్రమంగా ఏర్పాటు చేసిన నాన్ లేఅవుట్‌లో పంచాయతీ కార్యదర్శి బంగారు గోపీ మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో 10 హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బంగారు గోపీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గ్రామంలో వెలిసిన నాన్ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలు అధిక్రమించి అక్రమంగా లేఅవుట్లు వేసినా, నాన్ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

ప్రజాశక్తి - నరసాపురం

సాగు చేసే ప్రతి ఎకరానికీ నీరందిస్తామని నీటి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల మార్రాజు అన్నారు. మంగళవారం యర్రంశెట్టివారిపాలెంలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు ఏవిధంగా వస్తుందన్న దానిపై రైతుల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాజీ ఎఎంసి ఉపాధ్యక్షులు వైఎస్.బాబులు పంట బోదెల్లో పూడిక, గుర్రపు డెక్క ఉండిపోవడం వల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాలు స్పందించి కాల్వలను ఆధునికీకరించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

నరసాపురం:అందరూ కలిసిమెలిసి ఐక్యమత్యంగా ఉండాలని, కవ్వింపు చర్యలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి జి.శ్రీవేద అన్నారు. ఈ నెల 7వ తేదీన నరసాపురంలో పరస్పరం దాడి చేసుకున్న రెండు వర్గాల ప్రజలు, పెద్దలతో డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇరుగ్రూపుల పెద్దలు సమస్యను పరిష్కరించుకుంటామని, మరలా పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ బి.యాదగిరి, ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న మోటార్ సైక్లిస్ట్

వ్యక్తికి స్వల్ప గాయాలు

నేరాలు - ఘోరాలు

ఉండి:ఉండి నుండి కలిసిపూడి వైపు వెళ్లే రహదారిలో డ్యాం వద్ద ఇసుక మట్టి ట్రాక్టర్ అకస్మాత్తుగా నిలుపుదల చేయడంతో వెనుక వస్తున్న మోటార్ సైకిలిస్టు ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.ఉండి పడవల రేవులో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు బాషా మంగళవారం ఉదయం ఆకివీడు మండలం గుమ్ములూరులో పాఠశాలకు విధుల నిమిత్తం వెళ్తుండగా కలిసిపూడి వైపు వెళ్లే మట్టి ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేసి రోడ్డుపై నిలిపివేశాడు. అది గమనించని బాషా వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొన్నాడని, ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల తలకు ముఖానికి స్వల్ప గాయాలయ్యాయని వెంటనే స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన తోట రమేష్ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం అతనిని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ ఉమామహేశ్వరావు తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టౌన్ 29 వార్డు అరుంధతి పేటలో ఈ నెల 7వ తేదీన ఇరుగ్రూపులు దాడిచేసుకున్న సంఘటనలో ఆదివారం రెండు కేసుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ బి.యాదగిరి తెలిపారు. సిఐ కథనం ప్రకారం.. పరస్పర దాడులకు పాల్పడిన ఆకుల నాంచారి బాబు, పెదారి భరత్ కుమార్, సిర్రా సిద్దిక్, తెన్నేటి శ్యాంసన్ రాజును అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పిఎఫ్ చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న పది మంది సిహెచ్‌సి పారిశుద్ధ్య కార్మికులకు పిఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.చంద్ర సవేరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు షేక్ పాదుషా మాట్లాడుతూ కార్మికులకు పిఎఫ్ సొమ్ము 2024 మార్చి నుంచి ఏజెన్సీ కాంట్రాక్టర్ చెల్లించడం లేదని, మూడు నెలల వేతనాలు బకాయి పెట్టాడని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ఒపి బ్లాక్ వద్ద, ఇన్ పేషంట్ల బ్లాక్ వద్ద కార్మికులకు పని భారం పెరిగినందున అదనంగా కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికులకు పిఎఫ్ నిధులు తక్షణం చెల్లించాలని అలా జరగకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవేరి మాట్లాడుతూ కాంట్రాక్టర్ కార్మికుల పిఎఫ్, వేతనాల మంజూరు విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నాడని, ఉన్నతాధికారుల దృష్టిలో ఈ విషయం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల్లో మురుగు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - గణపవరం

ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా ఉంటే దోమలను నివారించవచ్చని గణపవరం సర్పంచి మూరా అలంకారం అన్నారు. మంగళవారం గణపవరం అన్ని వార్డుల్లో దోమల నివారణకు దోమలు మందు స్ప్రే చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దోమల వల్ల మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలు వస్తాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో అన్ని వార్డుల్లో పారిశుధ్యం క్షీణించకుండా ఉదయం, సాయంత్రం రహదారుల్లో చెత్తా చెదారాలను తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే బ్లీచింగ్ జల్లుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించండి'

ప్రజాశక్తి - ఉండి

ఉమ్మడి గోదావరి జిల్లా పట్టబద్రుల కూటమి ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధానత్యతా ఓటు వేసి గెలిపించాలని కలిగొట్ల ఎంపిటిసి రుద్రరాజు యువరాజు కోరారు. మంగళవారం మండలంలోని కలిగొట్ల, ఆరేడు సచివాలయాల పరిధిలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం రాజశేఖర్ పాటుపడతారన్నారు. ప్రచారంలో టిడిపి రాష్ట్ర నాయకులు యశోద కృష్ణయ్య, మాజీ ఎంపిటిసి నీలం సూర్యనారాయణ, టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సోలార్ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి ఇల్లూ సోలార్ పథకం ద్వారా వెలుగులు విరజల్లాలని, అప్పుడే భావితరాలకు విద్యుత్ కొరత లేకుండా ఉంటుందని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ పేర్కొన్నారు. నీలాద్రిపురంలో పిఎం సూర్య ఘర్ సోలార్ పథకంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ 3కెవి విద్యుత్ అందేలా సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదా అవ్వడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా పొందొచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్, సర్పంచి లక్ష్మణరావు, విద్యుత్ ఎఇ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని భీమవరం డిఎస్‌పి ఆర్.జయసూర్య అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ సూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి జయసూర్య మాట్లాడుతూ షాపుల యజమానులు, కూరగాయల వ్యాపారులు ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ నూకల గురునాయుడు, ప్రిన్సిపల్ రూపా సూర్యలక్ష్మి, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై మార్పులు రావాలని, ప్లాస్టిక్ ఎక్కడిక్కడ వేయడం వల్ల మూగ జీవాలు ప్లాస్టిక్‌ను తిని మృతి చెందుతున్నాయని, ఇది బాధాకరమని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ చేపట్టారు.

కాంగ్రెస్ సీనియర్ నేత రాజగోపాలరావు మృతి


రాజగోపాలరావు (ఫైల్‌ఫొటో)

నరసాపురం:మండలంలో తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచర్ల రాజగోపాలరావు (89) మంగళవారం కన్నుమూశారు. రాజగోపాలరావుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన నేత్రాలను దానం చేశారు. నిడదవోలు ఎల్‌వి.ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది ఆయన కార్నియాలను సేకరించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. నరసాపురం బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా, కార్యదర్శిగా, నరసాపురం అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యునిగా, ఎఎంసి పాలకవర్గ సభ్యునిగా, తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మతి పట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి బాబ్జి, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

చింతలకోటిగరువులో గర్భిణులకు సేంద్రియ ఆకుకూరలు అందజేస్తున్న సిడిపిఒ

సేంద్రియ ఆహారంతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - వీరవాసరం

పాలకోడేరులో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ టి.కె.వి.లక్ష్మీకాంతం అన్నారు. వివిధ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. మండలంలో పెంచుతున్న పోషణ వాటికలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ వాటికల్లో ఎనిమిది రకాల ఆకు కూరలతో పాటు వివిధ పండ్ల మొక్కలను కూడా పెంచుతున్నారు. వాటికల్లో పెంచిన ఆకు కూరలను, పండ్లను గర్భిణులకు అందజేస్తారు. ఈ సందర్భంగా చింతలకోటిగరువు ఆకుకూరలను పెంచిన అంగనవాడీ కార్యకర్త జానకి, సహాయకురాలు సావిత్రిని సిడిపిఒ అభినందించారు. అనంతరం రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజిని, ఉపాధ్యాయులు, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : బేటీ బచావో బేటీ పడావో అంటూ స్థానిక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలిక ఉన్నత పాఠశాల వద్ద కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు నివారించాలని, బాలికల అక్రమ రవాణా అరికట్టాలని, ఆడపిల్లలను చదువు మానిపించకుండా చదివించాలని తెలిపారు.

పాలకోడేరు : పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సిడిపిఒ వాణి విజయ రత్నం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిడిపిఒ వాణి విజయరత్నం ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాణి విజయరత్నం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఎవరికీ భయపడకుండా సమాజంలో తలెత్తుకుని ఆడపిల్లలు జీవించాలంటే వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ధైర్యంగా ప్రతి దాన్నీ ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం మహేష్‌బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి, అంగన్వాడీ టీచర్లు విమల, శాంతకుమారి పాల్గొన్నారు.

అర్తమూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థీ రాష్ట్ర ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. మంగళవారం అర్తమూరులో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థీ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యలు అధిగమించి ఆరోగ్యంగా ఉండొచ్చని సూచించారు. అనంతరం గ్రామంలోని మంచాన పడిన రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు అధ్యాపక, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - పెనుగొండ

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎస్‌వికెపి కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్ సంయుక్త ఆధ్వర్యంలో అధ్యాపక, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి అంశంపై ఈ నెల 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వైవివి.అప్పారావు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఐసిటిఇ మార్గదర్శి స్కీం ద్వారా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంలో విద్యాసంస్థలకు నాక్, ఎన్ఐఆర్ఎఫ్, ఎన్‌బిఎలో ఉన్నత ప్రమాణాలను పెంచి మూడేళ్లపాటు ఎన్నో ప్రయోజనాలను అందించాలన్నదే సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. సదస్సు ప్రారంభం రోజు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, పి.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, మార్గదర్శి స్కీం ముఖ్య సమన్వయకర్త డాక్టర్ పి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - నరసాపురం

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. మంగళవారం రాయపేట గౌతమి హెల్త్ క్లినిక్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి సూచనల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏటా అనేక మంది సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. అటువంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం డిఇఒ నారాయణ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలను విడనాడి ప్రజలు రక్తదానం దానం చేయాలన్నారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు, మొగల్తూరు ఎంపిడిఒ త్రిశూలపాణి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుష్పరాజ్యం, ఎనుమల సతీష్ పాల్గొన్నారు.

రైతులు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

వ్యవసాయ అధికారి సత్యనారాయణ

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ కోరారు. మంగళవారం కొమ్ముచిక్కాల గ్రామంలోని సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ చేయించు కోవడం ద్వారా ప్రభుత్వం నుంచి అందే అన్ని పథకాలూ, రాయితీలూ నేరుగా పొందొచ్చని తెలిపారు. రైతులకు సేవలు అందించడానికి రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. రైతులు తమ వెంట ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ తీసుకుని వెళ్లాలని ఆయన కోరారు.

అమ్మవార్ల ఆలయానికి సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

తూర్పుతాళ్లు గ్రామంలోని దండు మారమ్మ, పేట మారమ్మ అమ్మవార్ల ఆలయానికి గ్రామానికి చెందిన పలువురు దాతలు యాంప్లిఫ్లేయర్, మైక్‌సెట్ మంగళవారం బహూకరించారు. గ్రామానికి చెందిన ఈవన నాగేశ్వరరావు కుమారుడు ఆంజనేయులు, ఈవన సూర్యనారాయణ కుమారుడు' జయరాజు, కటకట్ల నరసింహారావు కుమారుడు వెంకట ఆదిత్య (బాబీ) అమ్మవారి ఆలయానికి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. వీరిని ఆలయ కమిటీ అభినందించింది.

ఉపాధ్యాయుల సంక్షేమానికి శివారెడ్డి కృషి

యుటిఎఫ్ మండల అధ్యక్షులు బిఆర్ఎంకె.స్వామి

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల మండల విద్యాశాఖలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ బండి శివారెడ్డి ఎనిమిదేళ్ల పాటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని యుటిఎఫ్ మండల అధ్యక్షులు బిఆర్ఎంకె.స్వామి అన్నారు. మంగళవారం కాళ్లలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ బండి శివారెడ్డికి యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు చక్కని సేవలందించి నేడు బదిలీపై గుంటూరు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల గౌరవాధ్యక్షులు వి.రవి కుమార్‌రాజు, మండల అధ్యక్షులు బిఆర్ఎంకె.స్వామి, మండల సహాధ్యక్షులు పి.ప్రభుదాసు, మండల కోశాధికారి ఎల్.అప్పలాచార్యులు, మండల కార్యదర్శి జి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

CHADALAVADA SRINU, S/o VENKATARAO, age 46 years, R/o. D.No.18-16, Indira Nagar, Relangi, Iragavaram Mandal, 534225, West Godavari District, A.P., do hereby state as follows:

I am deponent herein I am residing in the above address. I am the Indian Passport vide issued by regonal passport office Visakhapatnam. In which in the column of name my name noted as **CHEDALAVADA SRINU** instead of **CHADALAVADA SRINU.**

CHANGE OF NAME

CHADALAVADA MAVULU, W/o SRINU, age 38 years, R/o. D.No.18-16, Indira Nagar, Relangi, Iragavaram Mandal, 534225, West Godavari District, A.P., do hereby state as follows:

I am deponent herein I am residing in the above address. I am the Indian Passport vide issued by regonal passport office Visakhapatnam. In which in the column of name my name noted as **CHEDALAVADA MAVULU** instead of **CHADALAVADA MAVULU.**

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
O.S.No. 111/2022

బిట్వీన్:
దొంగల శ్రీరాం
S/o.దొంగల మధుసూధనరావు ...వాది
మరియు
దొంగల నిర్మల
రాచబత్తుల కళ్యాణి
నారపురెడ్డి వరలక్ష్మి ...ప్రతి వాదులు
వాది దాఖలు చేసుకున్న పబ్లికేషన్ :

పై నంబరు కల దావాలో రెండవ ప్రతివాది అయిన రాచబత్తుల కళ్యాణి (భర్త: రాచబత్తుల మధుబాబు, డోర్ నెం. 3బి-3-9/10, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు) అను వారు **తేది. 03-03-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పైన పేర్కొన్న కోర్టులో వ్యక్తిగతముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల పై నెంబరు దావా, మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

తూమేటి గంగరాజు
ఏలూరు అడ్వకేట్
ది.11-02-2025 ఏలూరు
సెల్: 99480 29519

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐ జెబిఎస్.ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రికార్డులను తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపే వారిని, హెల్మెట్ లేకుండా నడిపే వారి లైసెన్సులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ గౌరవ Iవ అదనపు సివిల్ జడ్జి, (జూనియర్ డివిజన్), ఏలూరు.
E.P.75/2023 in O.S.543/2019

Between:
Malla Durga Rao ...D.H.R.
and
పసుపులేటి అనుష, D/o.చక్రవర్తి, W/o.కొండమూడి జాన్ ప్రదీప్, D.No.3-19/1, St.Antony పబ్లిక్ స్కూల్ వద్ద, వాణినగర్, తంగెళ్ళపూడి, ఏలూరు. ...JDR

పై నెంబరు E.P లో సేల్ నోటీసు ఆర్డరు వేసినారు కావున మీ యొక్క హాజరు నిమిత్తం ది.**3-3-2025**న పైకోర్టు నందు ఉదయం 10.30 ని॥లకు వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కొనగలరు. కానీ ఎడల మీ పరోక్షమున పై నెంబరు E.P విచారణ జరుగునని తెలుసుకొనగలరు.

B.KUMAR,
Advocate for DHR
ఏలూరు అగ్రహారం, ఏలూరు.
ది.10-2-2024 Ph: 94938 98181.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
I.A.No. 930/2022

బిట్వీన్:
దొంగల శ్రీరాం
S/o.దొంగల మధుసూధనరావు ...వాది
మరియు
దొంగల నిర్మల
రాచబత్తుల కళ్యాణి
నారపురెడ్డి వరలక్ష్మి ...ప్రతి వాదులు
వాది దాఖలు చేసుకున్న పబ్లికేషన్ :

పై నంబరు కల దావాలో రెండవ ప్రతివాది అయిన రాచబత్తుల కళ్యాణి (భర్త: రాచబత్తుల మధుబాబు, డోర్ నెం. 3బి-3-9/10, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు) అను వారు **తేది. 03-03-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పైన పేర్కొన్న కోర్టులో వ్యక్తిగతముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల పై నెంబరు దావా, మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

తూమేటి గంగరాజు
ఏలూరు అడ్వకేట్
ది.11-02-2025 ఏలూరు
సెల్: 99480 29519

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, నరసాపురం
E.P. No. 9/2024 in O.S.No. 175/2016

బిట్వీన్:
మండ శ్రీనివాసరెడ్డి ...DHR
Vs
దాసరి వెంకట సత్యనారాయణమూర్తి
S/o. నరసింహమూర్తి, పాలకొల్లు. ...JDR

పై నెంబరు దావాలో DHR డిక్రీ బాకీ వసూలు కోరుచూ EP Sehedule Mortgaged Property Sale కొరకు సదరు EP దాఖలు చేసినందున, సదరు EP లో మీకు నోటీసు పంపించిననూ మీరు Notice Avoid చేయచున్నందున మీకు ఈ ప్రకటన ద్వారా శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి నందున మీరు **ది.21-02-2025 తేదీన ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా హాజరు కావలసియున్నది. లేనియెడల మీ పరోక్షమున సదరు EP లో అంశములో నిర్ణయించబడునని శ్రీ కోర్టు వారి ఆర్డరు పై తెలియజేయడమైనది.

K. Janardhana Reddy,
Tanuku B.Sc.,B.L, Advocate,
Dt. 11-02-2025 Tanuku
Cell: 93971 12777

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు
O.S.No. 836/2022

Between:
M/S Union Bank of India Peravali Branch, (Erst Andhra Bank) rep., by it's Manager Tanuku ...Plaintiff
And
1. Kannepamula Shyam Babu
2. Kannepamula Ratna Kumari ...Defendants

To
1. Kannepamula Shyam Babu, S/o. Krupavaram, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram, Tanuku
2. Kannepamula Ratna Kumari, W/o. Shyam Babu, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram, Tanuku Godavari District.

పై నెంబరు దావాలో వాది కోర్టు ద్వారా మీకు నోటీసును పంపించి ఉన్న మీరు తీసుకోకుండా ఎవైడ్ చేస్తున్నందున సబ్స్ట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసు మీకు తెలియపరుచున్నందున మీరు పై నెంబరు దావా వాయిదా **ది.24-02-2025వ తేదీను ఉదయం గం. 10-30 ని.లకు** స్వయంగా గాని, లేదా మీ తరుపున అడ్వకేట్ గారి ద్వారా గాని కోర్టుకు హాజరై తమ ఆక్షేపణలు తెలియపరుచుకొనవచ్చును. లేనియెడల సదరు గౌరవ న్యాయస్థానం వారు ఏకపక్షంగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కామన మునిస్వామి
తణుకు అడ్వకేట్, తణుకు
ది. 11-02-2025 సెల్: 94414 47403